జీతాల కోసం రోడ్డెక్కాల్సిందేనా..!

- కార్పొరేషన్ ముందు కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల ధర్నా
- 515 మంది కార్మికులు, 150 మంది ఇతర కాంట్రాక్టు సిబ్బంది ఆందోళన
- గుమస్తాల నిర్లక్ష్యంతో సకాలంలో అందని జీతాలు
- సకాలంలో జీతాలివ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామంటున్న కార్మికులు

మచిలీపట్నంటౌన్: పగలనకా రేయనకా రెక్కలు ముక్కలు చేసుకుంటూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు మాత్రం సకాలంలో అందటం లేదు. నగర పాలక సంస్థ కార్యాలయంలో వీరి జీతాల బిల్లులను చేసే గుమస్తాల నిర్లక్ష్యమే ఇందుకు కారణం. ఫలితంగా కార్మికులు వారి జీతాల కోసం ప్రతి నెలా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. హెల్త్ సెక్షన్‌లో పని చేస్తున్న గుమస్తాలు ప్రతి నెలా 25వ తేదీన కార్మికుల జీతాల బిల్లులను తయారు చేస్తే నెల మొదటి వారంలోనే వీరికి జీతాలు అందుతాయి. అయితే బిల్లుల తయారీలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కార్మికులకు అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన జీతాలు ఇప్పటికీ అందలేదు. దీంతో వారి కుటుంబ జీవనం ఇబ్బందిగా మారింది. ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యావసర సరుకులు వంటివి కొనుగోలు చేసేందుకు అప్పుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది అప్పులు చేసి నెట్టుకొస్తుండగా, మరికొంతమంది అప్పులు పుట్టక నానా ఇబ్బంది పడుతున్నారు.



నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

665 మందికి అందని జీతాలు

నగర పాలక సంస్థ పరిధిలో 515 మంది కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు, 150 మంది కాంట్రాక్టు డ్రైవర్లు, ఫిట్టర్లు, అసిస్టెంట్ ఫిట్టర్లు, అసిస్టెంట్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌లకు రెండు నెలల జీతాలు ఇంకా అందకపోవటంతో ఇబ్బంది పడుతున్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు, తాగునీటి సరఫరా తదితర పనుల్లో ఈ కార్మికులు కీలకంగా పని చేస్తున్నా కార్యాలయ సిబ్బంది మాత్రం వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జీతాల బిల్లుల తయారీలో అశ్రద్ధ వహిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

జీతాల కోసం కార్మికుల నిరసన

ప్రతి నెలా తమకు జీతాలను సకాలంలో అందించకపోవటం, అక్టోబర్, నవంబర్ నెలల జీతాలు ఇప్పటికీ అందకపోవటాన్ని నిరసిస్తూ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతి నెలా ఇబ్బంది పెడితే ఎలా?



మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు, ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు రెండు నెలలుగా జీతాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులే కదా అని గుమస్తాలు చిన్నచూపుతో జీతాల బిల్లులు సకాలంలో చేయటంలేదు. అందువల్లే ఈ సమస్య ఎదురవుతోంది. ప్రతిసారీ జీతాల కోసం కార్మికులు ధర్నాలు చేయాల్సి వస్తోంది.

– బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా కోశాధికారి

ప్రభుత్వానికి సకాలంలోనే పంపాం



కాంట్రాక్టు కార్మికుల జీతాల బిల్లులు సకాలంలోనే చేసి ప్రభుత్వానికి పంపాం. అయితే జీతాల చెల్లింపునకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రావాల్సిఉంది. ఈ సమస్య రాష్ట్రమంతా ఉంది. ఒక్క మచిలీపట్నంలోనే కాదు. ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రాకపోవటంతోనే రెండు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతులు రాగానే కార్మికులకు జీతాలు చెల్లిస్తాం.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ఎంఎంసీ కమిషనర్

క్లుప్తంగా

15వ ఆర్థిక సంఘ నిధులతో పుష్ కార్టుల కొనుగోలు



పెడన: పెడన పురపాలక సంఘానికి 15వ ఆర్థిక సంఘ నిధులతో రెండు ట్రాక్టర్లు, ఒక ట్రక్కు, 25 పుష్ కార్టులను కొనుగోలు చేసినట్టు మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ తెలిపారు. పెడన పురపాలక సంఘానికి చేరిన పుష్ కార్టులను ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.25 లక్షలతో వీటిని టెండర్ల ద్వారా పిలిచి కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తులో చెత్త సేకరణ మరింత పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవడానికి ఇవి ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోమట్ల అనిల్‌కుమార్, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికిషోర్ తదితరులున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జిల్లా మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలోని బాలింతలకు, ఇతర రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల వీర వెంకట సత్యనారాయణతో పాటు సంఘ ప్రతినిధులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టార్ కాలేజీ డైరెక్టర్ అయ్యప్పస్వామి, సంఘ ప్రతినిధులు టి.రాజ్యలక్ష్మి, కుంభ ఆదిలక్ష్మి, ఎం.దేవిక, టి.శిరీష, రాగి చంద్రశేఖర్, బోలేం వేంకటేశ్వరరావు, కుమార్, వీరంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిర్వహణలో అలసత్వం



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గత ఏడాది కాలంగా పనిచేయడం లేదని జనసేన పార్టీ నాయకులు కోసూరు రామాంజనేయులు సోమవారం తెలిపారు. మోపిదేవికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది మండల కార్యాలయానికి రావడంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారని, ఇలాంటి ప్రదేశంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సీసీ కెమెరాలను పునరుద్ధరించాలని కోరారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన



కోడూరు: 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్'పై కోడూరు పోలీసులు సోమవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మండలంలోని లింగారెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలలో ఎస్‌ఐ చాణిక్య విద్యార్థినులతో చిట్‌చాట్ నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో పడి పూజ

పెడన: పట్టణంలో ఉన్న శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీహరిహర సుత అయ్యప్ప స్వామి 22వ మండల పూజ మహోత్సవాన్ని పురస్కరించుకుని దివ్య పడిపూజను బ్రహ్మశ్రీ గూడూరు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, కలశ పూజ, 18 మెట్ల పూజ మహోత్సవాలను నిర్వహించారు. పెడన పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వామి మాల ధరించిన పలువురు మాల ధారులు, భవానీ దీక్షాపరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహానికి పైపులైన్ సౌకర్యం

కోడూరు: మండలంలోని స్వతంత్రపురం ఎస్సీ బాలికల వసతి గృహానికి ఎన్‌ఆర్‌ఐ సహకారంతో తాగునీటి పైపులైన్ సౌకర్యాన్ని సమకూర్చారు. వసతి గృహంలో బోరు నుంచి వచ్చే నీరు ఉప్పగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గమనించిన ఉల్లిపాలెం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం సమస్యను తన పూర్వ విద్యార్థి అయిన పాదాల నవీన్ దృష్టికి తీసుకువెళ్లారు. నవీన్ ఉద్యోగ రీత్యా కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాడు. నవీన్ ఈ సమస్యపై వెంటనే స్పందించి నూతన పైపులైన్ ఏర్పాటుకు అవసరమైన రూ.16వేలు వితరణగా ఇచ్చారు. ప్రస్తుతం పైపులైన్ వెంట తాగునీరు రావడంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు నాగభూషణం కృషి, దాత నవీన్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

15న గుంటూరులో మాల మహాగర్జన

అవనిగడ్డ: ఈనెల 15వ తేదీన గుంటూరులో జరిగే మాల మహాగర్జనను విజయవంతం చేయాలని పలువురు నేతలు సోమవారం ప్రచారం చేశారు. స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో జరిగిన కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, జైభీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ మాట్లాడుతూ గుంటూరులో జరిగే మాలమహాగర్జనకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకుడు నీలా మనోహర్‌తో పాటు పలువురు అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు తెలిపారు. మండలంలో కొక్కిలిగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతు మత్తి కృష్ణారావు తనకు చెందిన ఆర్‌ఎస్ నెంబర్ 605/1, 22/1లో 1.60 ఎకరాల భూమిలో 24 సెంట్లు 2016లో కృష్ణా కరకట్ట విస్తరణలో కోల్పోయిందని తెలిపారు. దానికి సంబంధించి నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించలేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తహసీల్దార్‌లు, ఆర్డీఓలు మారుతున్నా తన సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. మరో రైతు చాకమూరి చలపతిరావు 3 ఎకరాల వరి పంటను మాసూలు చేసి ఆరపెట్టానని, 5 రోజులుగా సంచులు లేక అధికారులు తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఈ విషయంపై ఆర్‌ఎస్‌కేలో సంప్రదించగా వారం రోజుల క్రితం 5 వేల బ్యాగ్‌లు కావాలని ఇండెంట్ పెట్టామని, అవి రావాల్సి ఉందని తెలిపారు. తహసీల్దార్ స్పందిస్తూ వెంటనే సంచులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి పంపారు. అనంతరం గ్రామస్తుల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ రామకృష్ణబాబు, దేవదాయశాఖ ఈఓ జోగి ప్రవీణ, మండల కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, వీఆర్‌ఓ వరప్రసాద్, సచివాలయ కార్యదర్శి వాకా రవిబాబు, వెంకటరమణ, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

కోనేరుసెంటర్: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని, ఈ సదస్సులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని మేకవానిపాలెం సచివాలయంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూవివాదాలు, తగాదాలు, రిజిస్ట్రేషన్‌లు, రెవెన్యూ రికార్డుల్లో పేర్ల నమోదు, పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు, చేర్పులు వంటి అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించటమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుంచే దుర్గాప్రసాద్ (నాని), క్లస్టర్ ఇన్‌చార్జ్ తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు, డెప్యూటీ తహసీల్దార్ సత్య, ఆర్‌ఐ రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం ద్వారా రూ.11 లక్షలు ఆదాయం

పెడన: పెడన పట్టణంలో ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ మార్గంలో పురపాలక సంఘ పరిధిలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి, ఆ దుకాణాల నుంచి రుసుం వసూలు చేసుకునేందుకు సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా పురపాలక సంఘానికి రూ.11 లక్షలు ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అన్నారు. ఈ బహిరంగ వేలం పాటలో ఏడుగురు పాల్గొన్నారని, హెచ్చు పాటదారుడు వెనిగళ్ల వరప్రసాద్‌కు పాటను ఖాయం చేసినట్లు గోపాలరావు తెలిపారు. 2022లో రూ.4.71 లక్షలు సర్కారు పాట పెట్టగా రూ.6.21 లక్షలు ఆదాయం వచ్చిందని, గత ఏడాది సర్కారీ వారి పాట రూ.5.10 లక్షలకు పెట్టగా రూ.5.21 లక్షలు వచ్చాయన్నారు. ఇప్పుడు సర్కారి వారి పాట రూ.5.40 లక్షలు పెట్టామని, వెనిగళ్ల వరప్రసాద్ రూ.11లక్షలకు పాడుకున్నారని కమిషనర్ పేర్కొన్నారు. ఈ వేలం పాటలలో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణయ్య, సుబ్రమణ్యం, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.


వేలం పాటలను నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

ఉపాధ్యాయునిపై విద్యార్థుల దాడి అమానుషం

చిలకలపూడి(మచిలీపట్నం): అన్నమయ్య జిల్లా రాయచోటి ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయునిపై విద్యార్థులు దాడిని ఖండిస్తూ సోమవారం మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ డీకె బాలాజీకి ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల దాడి వలన ఎజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడు మరణించాడన్నారు. సోషల్‌మీడియా ప్రభావంతో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, విద్యార్థుల్లో ఈ వైఖరి మారాలంటే నైతిక విలువలు నేర్పించాలన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో గుట్కా, గంజాయి వంటి మాదకద్రవ్యాల వాడకాన్ని నియంత్రించాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫ్యాప్టో నాయకులు బి.లంకేష్, డి.అశోక్‌కుమార్, రాజేంద్రప్రసాద్, యు.ఉమామహేశ్వరరావు, ఎ.సుబ్రహ్మణ్యం, పి.సూరిబాబు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వివరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే కాగిత

గూడూరు: పామర్రు మండలం కురుమద్దాలి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన క్షతగాత్రులను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం పరామర్శించారు. గూడూరు మండలం మల్లవోలుకు చెందిన 14 మంది వ్యవసాయ కూలీ పనుల కోసం పెనమలూరుకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వీరిని చికిత్స కోసం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వపరంగా బాధితులను అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు పోతన స్వామి, గోపి నాగబాబు, బత్తిన వీరబాబు, పోతుల రాము, పూల నాగరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.


బందరు ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

కృత్తివెన్ను: మండలంలోని గరిశపూడిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు రోజున ఆలయం వద్ద నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పుట్టలో పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరం

బంటుమిల్లి: విద్యార్థులకు చిన్నతనం నుంచి సామాజిక పరిస్థితులు, సమస్యలపై అవగాహన ఉండాలని ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకుడు, మోటివేటర్ అరవింద సత్య అన్నారు. మండల పరిధిలోని పెందుర్రు, బంటుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు పలు అంశాలపై ఆయన అవగాహన కలిగించారు. మారిన కాలమాన పరిస్థితుల్లో విద్యార్థులు పాశ్చాత్య పోకడలు అలవరుచుకుని పూర్వీకులు అందించిన సనాతన సంప్రదాయాలకు దూరం అవుతున్నారన్నారు. భారతీయ సనాతన ధర్మంలో పెద్దలు మంచి ఆహారం, అలవాట్లను అందించారని వాటిని విస్మరించి ఫ్యాషన్ మోజులో పడి వాటికి దూరం అవుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు విషయాలకు చెందిన పుస్తకాలను విద్యార్థులకు తన సొంత ఖర్చుతో బహూకరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాకర్లమూడి, బలిపర్రులో రెవెన్యూ సదస్సులు

పెడన: మండల పరిధిలోని కాకర్లమూడి, బలిపర్రు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కాకర్లమూడిలోను, మధ్యాహ్నం 2 గంటల నుంచి బలిపర్రు, శింగరాయపాలెం గ్రామాలకు కలిపి బలిపర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సులుంటాయన్నారు. భూ సమస్యలపై జరిగే ఈ సదస్సులకు గ్రామస్తులు తమ భూమి సమస్యలపై ఏమైనా సందేహాలు, ఇబ్బందులున్నా తమ దృష్టికి లిఖిత పూర్వకంగా తీసుకువస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తహసీల్దారు సూచించారు.

రూ.30 వేల విలువ చేసే కంప్యూటర్ బహూకరణ

కోడూరు: మండలంలోని బడేవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ దాతలు కంప్యూటర్‌ను బహూకరించారు. గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బడే వీరవెంకటరావు కుమారుడు బద్రీనాథ్, కుమార్తె నిహారిక అమెరికాలో ఉంటున్నారు. వీరు గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా రూ.30వేలు విలువ చేసే కంప్యూటర్ యూనిట్‌ను తండ్రి వీరవెంకటరావు చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందించారు. ఈ ఏడాది తమ జెడ్పీ పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చే మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలు, రూ.5వేలు, రూ.4వేల నగదు బహుమతులను అందించనున్నట్లు వీరవెంకటరావు తెలిపారు. ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి

పైడమ్మ జాతర మహోత్సవాలపై సమీక్ష

పెడన: అన్ని శాఖలకు చెందిన సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే పైడమ్మ సంబరాలను విజయవంతం చేయవచ్చునని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆయన ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావుతో కలిసి వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు జరిగే పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయం వద్దకు డీజేల ప్రవేశం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖాపరంగా చేపట్టాల్సిన చర్యలు, అంతరాయం లేకుండా చూడాలని కోరారు. వైద్య శాఖ వారు ఆలయం సమీపంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ వారు ప్రతి రోజు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. ఈ నెల 23వ తేదీన పైడమ్మ చెరువులో అమ్మవారి తెప్పోత్సవం ఉంటుందని, పోలీసు వారు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐ–2 రాజేంద్రప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పైడమ్మ జాతర మహోత్సవాలపై సమీక్షిస్తున్న అధికారులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీ కాలనీ వాసులు

మచిలీపట్నంటౌన్: మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. డాన్‌బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక దేవునితోటలోని యానాదుల కాలనీలో సెల్ ఫోన్ వినియోగం, మత్తు పదార్థాలు తీసుకోవటం వలన కలిగే అనర్థాలపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ ఎంఎల్ అల్ఫోన్స్‌రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలను తీసుకోవటం వలన అనారోగ్యానికి గురవటమే కాకుండా ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కుటుంబ జీవనంలో అనేక ఆటంకాలు ఎదురై కుటుంబం అస్తవ్యస్తంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ వసంత, డాన్‌బాస్కో లెర్నింగ్ సెంటర్ టీచర్లు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

బీజామృతంతో చీడపీడల నుంచి పంటకు రక్షణ

కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి

ఘంటసాల: బీజామృతం వినియోగించడం ద్వారా వివిధ పంటలను చీడ పీడల నుంచి రక్షించుకోవచ్చునని ఘంటసాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో సోమవారం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కె.రేవతి బీజామృతం తయారీ విధానాన్ని రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ బీజామృతం వివిధ పంటలలో తక్కువ ఖర్చుతో విత్తన శుద్ధికి, కూరగాయ మొక్కల నారు శుద్ధికి వినియోగించుకోవడం ద్వారా చీడ పీడల నుంచి పంటకు రక్షణ కలుగుతుందని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ నవీన్, యశ్వంత్, కృష్ణవేణి, ఐసీఆర్పీ యూనిట్ ఇన్‌చార్జి నాగరాజు, ఐసీఆర్పీలు,రైతులు పాల్గొన్నారు.


బీజామృతం తయారీని పరిశీలిస్తున్న సమన్వయకర్త డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్తలు, రైతులు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

గూడూరు: గూడూరు పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పాడి రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. 2024 ఆగస్టు ఒకటి నుంచి నవంబర్ 30 మధ్య కాలంలో సంఘానికి వచ్చిన లాభాలను రైతులకు పంపిణీ చేశారు. సంఘం పరిధిలోని 20 మంది రైతులకు రూ.35,850 బోనస్‌ను సంఘ అధ్యక్షుడు గొరిపర్తి కృష్ణమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర్ కృష్ణ, సూపర్‌వైజర్ కైలా రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకునూరి సుబ్రహ్మణ్యం కుమారుడి వివాహాన్ని పురస్కరించుకుని కళ్యాణ మస్తు పథకం కింద రూ.20వేల విలువైన బంగారు నాణేన్ని అందజేశారు.

పెరటి మొక్కల విత్తనాలు పంపిణీ



రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని రావివారిపాలెంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెరటి మొక్కల విత్తనాలైన బెండ, తోటకూర, పాలకూర, బీరకాయ విత్తనాలను సోమవారం గ్రామస్తులకు పంపిణీ చేశారు. జాతీయ సేవా పథకంలో భాగంగా విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తెలిపారు. మొక్కలు సేంద్రియ పద్ధతిలో రసాయనాలు వాడకుండా పెంచాలని, తద్వారా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. రైతులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, జొన్నలగడ్డ రామ్మోహనరావు, బాపట్ల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.